“థ్యాంక్యూ డాక్టర్... మీ మేలెన్నటికీ మరిచిపోలేం... అసలెందుకిలా అయింది? మరేం పర్వాలేదుగా...?” అంటూ సత్యమూర్తి తెగ ఆదుర్దా పడిపోయాడు.

“చూడండి... మీరంతా నాకు చాలాకాలం నుండి పరిచయం. నాకు తెల్సి గతంలో ఎప్పుడూ కూడా ఇలా జరగలేదు. ఏదో పెద్ద షాక్ తగిత్తే తప్ప ఇలా ఉన్నట్టుండి స్పృహ కోల్పోవడం జరగదు. ఏమంటారు?”

”కరెక్ట్ సార్... నిజంగా చాలా హెల్దీగా ఉంటుంది మా అన్నా. మరేమైందో ఏమో... ఇలా స్పృహ కోల్పోయిందంటే నమ్మలేకుండా ఉన్నాం!”

“ఎంతటివాళ్ళకైనా ఓ వయసొచ్చింతర్వాత ఇలాంటివి కామన్‌గా జరుగుతుంటాయి. మీరేం వర్రీ కాకండి. అయితే ఒక్క విషయం... ఆమెకు రెస్ట్ బాగా అవసరం. కనీసం ఓ వారం దాకా ప్రశాంతంగా ఉండనివ్వండి. రాసిచ్చిన మందులు టైం ప్రకారం వాడండి. ఆహార విషయంలో నేను చెప్పిన అన్ని విషయాలూ గుర్తున్నాయిగా...?” అంటూ చిరునవ్వుతో వెళ్ళిపోయాడు డాక్టర్.

“అసలేమయిందండీ? ఆ రక్తమేంటీ? దెబ్బలెలా తగిలాయ్? మీకేం ప్రమాదం లేదుగా?” అంటూ అన్నపూర్ణ తెగ బాధపడిపోతూంటే... అంతా అయోమయంలో పడిపోయారేం అర్థంకాక!

అవన్నీ పరాకు మాటలనీ, ఇప్పుడే స్పృహలోకి వచ్చిన అన్నపూర్ణకి అంతా అయోమయంగా ఉందనుకుని... “అదేం లేదు... నాకేం కాలేదు.. నాల్రోజులు నువ్వు హాయిగా రెస్ట్ తీస్కో...” సత్యమూర్తి మాటలు పూర్తి కాకుండానే,

“నాకేం కాలేదండీ... మీరేంటి? రక్తం మడుగులో ఉన్నారు! అసలేమైంది?” మళ్ళా మొదటికొచ్చింది అన్నపూర్ణ.

“అమ్మా... ప్రశాంతంగా ఉండమని డాక్టర్ చెప్పారుగా! మరీవాగుడేంటి అర్థం లేకుండా...” కాస్త కటువుగానే అన్నాడు తేజా... చిన్నపిల్లని మందలించినట్లుగా!

* * *

“అమ్మగారూ!” అంటూ గట్టిగా పిల్చింది చాకలి లక్ష్మి.

“చూడమ్మా! నిన్న కేంప్ నుండి వచ్చేటప్పుడేస్కున్న ఆ ధోవతీ, లాల్చీకూడా లక్ష్మికి వేసెయ్. తెల్లగా ఉతికి గంజిపెట్టి ఇస్త్రీ కూడా చేసి తీసుకు రావాలని చెప్పు” లోపల్నుండే పెద్దగా అరిచాడు కోడలికి వినపడేలా!

“అలాగే మామయ్యా!” అంటూ ఆ ధోవతీ తీసీ తియ్యగానే అత్తగారు అన్నపూర్ణలా స్పృహ తప్పి పడిపోలేదుగానీ,

“ఈ రక్తం మరకలేంటి మామయ్యా!?”

ఆశ్చర్యంగా కోడలు ప్రశ్నించేసరికి - ఫ్లాష్‌బేక్‌లోకెళ్ళిపోయి...

“అయ్యబాబోయ్! నిన్న రాత్రంతా బస్సులో నా పక్కన కూర్చున్న వ్యక్తి మా ఇద్దరికీ మధ్య పెట్టిన మూటలాంటి ఐటమ్ చూసి ఏమిటో అనుకున్నా! అది ఊరగాయల మూటన్నమాట! ప్యాకేజీ లీకై నాకు తెలీకుండానే ఎర్రటి నూనె జిడ్డంతా మందంగా నా ధోవతీకి పట్టేసిందన్న మాట! అదేదో రక్తమని భావించి భార్యామణి ఇంత హడావుడి చేసేసింది! ఎంతపనయింది?” అనుకుంటూ...

ఊరగాయల సీజన్‌లో బస్సు ప్రయాణం చేయనుగాక చేయనంటూ శపథం చేశాడు పాపం మన సత్యమూర్తి!

*



## సౌందర్య తెలుగు సినిమా నిర్మాణం

తెలుగులో నెంబర్ వన్‌గా వెలిగి, అవకాశాలు తగ్గుతున్నాయనగానే వివాహం చేసుకున్న సౌందర్య ఇప్పుడు తెలుగులో ఓ సినిమా నిర్మించబోతోందట. ఆ మధ్య కన్నడంలో ఆమె నిర్మించిన ‘ద్వీప్’ సినిమాకి అనేక అవార్డులు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే తెలుగులో నెంబర్ వన్‌గా ఉండి సంపాదించిన డబ్బుతో తన మాతృభాషలో సినిమా తీయడమేంటని అనేక మంది విమర్శలు గుప్పించారు. సౌందర్య ఆ విమర్శలకు ఎటువంటి సమాధానమివ్వకుండా మౌనంగా ఉండిపోయింది. మళ్ళీ ఇంత కాలానికి తెలుగులో సినిమా నిర్మించబోతోందని టాలీవుడ్ బోగట్టా!



## హుస్సేన్ చిత్రంలో ఊర్మిళ

గజగామిని మాధురీదీక్షిత్, టాబులతో సినిమాలు తీయాలన్న కోరిక నెరవేరగానే ఇప్పుడు మనసు ఊర్మిళ మీదకి మళ్ళినట్టుంది చిత్రకారుడు ఎం.ఎఫ్. హుస్సేన్‌కి. త్వరలో ఊర్మిళతో సినిమా తీయబోతున్నాడట. తెరమీద ఎవ్వరూ ఏ హీరోయిన్నీ చూపించని కొత్త కోణంలో ఊర్మిళని చూపిస్తానని హుస్సేన్ చెప్పాడట. ఊర్మిళ కూడా హుస్సేన్ తీయబోయే సినిమా రంగీలాని మించిపోతుందని చెబుతోందట. ఇంకేం చూసేవాళ్ళకి థియేటర్లో వేడి నిట్టూర్పులు తప్పవన్నమాట!